# కనీ వినీ ఎరుగని రీతిలో బోస్టన్ సంక్రాంతి సంబరాలు

దాదాపు 1200 మంది తెలుగు వారి సమక్షంలో బోస్టన్ పరిసర ప్రాంతాల తెలుగు సంఘం (TAGB) జనవరి 20, 2007 న నిర్వహించిన సంక్రాంతి కార్యక్రమం శనివారం డిశంబరు ఇరవై తారీకు నాడు విజయవంతంగా జరిగింది. కేవలం బోస్టన్ ప్రాంతంలోని ఔత్సాహిక కళాకారులతో, ముఖ్యంగా అధిక భాగం అంశాలు చిన్న పిల్లలతో మాత్రమే చేయడం ఈ కార్యక్రమం విశేషం. కార్యక్రమ రంగం లోపల, బయట కూడ TAGB కార్యవర్గం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని బొమ్మల కొలువులతో, పోస్టర్ ప్రదర్శనలతో తెలుగుతనం ఉట్టిపడేటట్టు సంక్రాంతి పండుగకి సంభందించిన చక్కని పరిసరాలు కల్పించారు. TAGB అధ్యక్షుడు శ్రీనివాస్ కాకి గారు తమ ప్రసంగంలో ఈ రజతోత్సవ సంవత్సరంలో సంఘం Non-Profit సంస్థగా గుర్తింపు పొందనున్నదని, అలాగే యువతరం కోసం ఒక ప్రత్యేక కార్యవర్గాన్నీ, ఒక ప్రణాళికను తయారు చేస్తున్నామని తెలియజేశారు. పది గంటలకు పైగా సరిపడ అంశాలు వచ్చాయని, కాని వాటిని సగానికి పైగా కుదించవలసి వచ్చిందని చెప్పారు. కార్యక్రమానికి సంధాతలుగా వ్యవహరించిన పద్మజ, శ్రీనివాస్ బాల దంపతులు ఛలోక్తులతో, సందర్భోచితమైన వ్యాఖ్యానాలతో అంశాలని రక్తి కట్టించారు.

కార్యక్రమంలో ముఖ్యమైన అంశాలన్ని రెండువందల ఏభయి మందికి పైగా చిన్నారులు చేసినవే. తలి తండ్రుల ప్రోత్సాహంతో, సంగీత, నృత్య టీచర్ల సహకారంతో, బాలబాలికలు తమ ప్రతిభా పాటవాలని ప్రదర్శించి ప్రేక్షకులని ఆహ్లాద పరిచారు. అధిక భాగం సమకాలీన సినిమా పాటల కు అభినయం చేసే అంశాలు వున్నప్పటికీ, కార్యక్రమంలో జానపద నృత్య గీతాలు, భక్తి రస ప్రధానమైన నాటికలు పాటలు అనేకం ప్రదర్శించ బడ్డాయి. వారు పోషించిన పాత్ర చిన్నదైనా, పెద్దదైనా అందరు పిల్లలు కళ్ళు చెదిరే దుస్తులు, ఆకర్షణీయమైన వేషధారణ చేయడంతో ప్రదర్శనలు మరింత రక్తి కట్టాయి. ఇలా కొత్త పాతల కలయికతో, భక్తి రక్తి మేళవింపుతో, హుషారయిన సినిమా పాటలతో, వీనులవిందయిన శాస్త్రీయ గానాలతో, ఇంతటి నైపుణ్యం బోస్టన్ ప్రవసాంధ్రుల పిల్లల్లో వుందా అనిపించే విధంగా చిన్నారులు తమ ప్రతిభని నిరూపించారు. కార్యక్రమం మొదటిలోనే పెద్దలు వారిని వేదికపైన భోగిపళ్ళతో మనసారా ఆశీర్వదించిన మహిమ కాబోలు!

పెద్దలు చేశిన కొద్ది అంశాలు కూడా చిన్న వారి ప్రతిభకి తీసిపోని విధంగా జరిగాయి. మూసలో పోసిన తెలుగు సినిమా కథల మీద పేరడి హాస్య నాటిక కడుపుబ్బ నవ్వించింది. పాత సినిమా పాటల వల్లరి మధుర భావాలలో అందరినీ ముంచెత్తింది. తెలుగులో స్టాండ్-అప్ హాస్య భాషణ, అర్ధాక్షరి అనే పాటల కర్యక్రమం వంటి నూతన ప్రయోగాలని ప్రేక్షకులు హృదయపూర్వకంగా ఆదరించారు.

కార్యవర్గ సంఘం నిర్వహించిన ముగ్గులు, చిత్ర కళల పోటీలలో న్యాయ నిర్ణేతలు Smt. Rajani Kota, Smt. Padma Govinda Rao గార్ల ఎంపికలొ విజయం సాధించిన చిన్నారులకు, పెద్దవారికి TAGB పూర్వ అధ్యక్షుడు శ్రీ పోలవరపు బాబూరావు గారు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి తోడ్పడిన అనేక మంది స్వచ్ఛంద కార్యకర్తలకి, పసందైన విందు భోజనం సమకూర్చడమే కాకుండ కార్యక్రమాన్ని స్పాంసర్ చేసిన మినర్వా రెస్టారంట్ కు, మిగతా స్పాంసర్లైన Bestprintbuy.com, Aadya Consulting మరియు Teluguone.com సంస్థలకు సంఘం ఉపాధ్యక్షులు డా. సూర్య జయంతి గారు ధన్యవాదాలు తెలిపారు. మొత్తమ్మీద TAGB సంక్రాంతి కార్యక్రమం చిన్నపెద్ద కళాకారుల ఉత్సాహంతో, ఊహించినదానికంటే ఎక్కువ సంఖ్యలో హాజరయిన ప్రేక్షకుల అలుపెరుగని ప్రోత్సాహంతో, సాంకేతికంగా నూతనత్వంతో, కొత్త-పాత తెలుగు సంస్కృతుల కలయికతో, మునుపెన్నడూ జరగనంత విజయవంతంగా ముగిసింది.

- దేవరకొండ శ్రీనివాసరావు, వెస్ట్ ఫోర్డ్